క్లుప్తంగా

కనకదుర్గమ్మకు అభిషేకాలు


క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు

తాళ్లపూడి: తాళ్లపూడిలో కొలువైన నవ దుర్గాది పరివార సహిత కనకదుర్గమ్మవారికి బుధవారం ఘనంగా నవ నదీ జలాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు.అర్చకుడు శివప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. 108 బిందెలతో అమ్మవారికి పాలాభిషేకం, కలశాల పూజలు, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు.భక్తులకు అమ్మవారి నిజరూప దర్శనం కల్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. మహిళలు ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు నీలి సూర్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కామలలో కళ్లజోళ్ల పంపిణీ


ముక్కామలలో కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు అరుణకుమారి

పెరవలి: పేదల సంక్షేమం కోసం లయన్స్ క్లబ్ నిర్వహిస్తున్న పలు సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ పెరవలి శాఖ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి అన్నారు. మండలంలోని ముక్కామలలో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో గుర్తించిన 27 మందికి బుధవారం ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ చేశారు. శ్రీరాం సురేష్ ఆర్థిక సహాయంతో కళ్ళ జోళ్ళకు అందించామని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోనే అత్యధిక వైద్య శిబిరాలు నిర్వహించిన లయన్స్ క్లబ్‌ల జాబితాలో పెరవలి క్లబ్ మొదటి స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో ముక్కామల సర్పంచ్ కేతా త్రిమూర్తులు, ఎంపీటీసీ సభ్యుడు గండేపల్లి రామకృష్ణ, లయన్స్ క్లబ్ సభ్యులు బోళ్ల మంగారావు, అడపా బాలసుబ్రహ్మణ్యం, అరిగెల వేణు, మానికిరెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలంటూ నిరసన

నిడదవోలు రూరల్: కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం తొండంగి మండలం శృంగవృక్షం గ్రామంలో దళిత యువకుడు నడిపల్లి రాజును హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. నిడదవోలు సంత మార్కెట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ నాయకులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ రాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, టి.నాని, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కొవ్వూరు: దొమ్మేరు సమీపంలోని పతివాడ లేఅవుట్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పట్టణ పోలీసులు బుధవారం సాయంత్రం కనుగొన్నారు. సుమారు 50 ఏళ్ల వయసున్న ఆ మృతదేహం కుళ్లిపోయిన దశలో ఉంది. సుమారు నాలుగైదు రోజుల క్రితం ఆ వ్యక్తి మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలంలో మృతుడి సంబంధించిన ఎలాంటి సమాచారం లభ్యం కాలేదు. దొమ్మేరు సర్పంచ్ తానేటి కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు సీఐ ఏఎస్ఎన్ రవికుమార్ తెలిపారు.

కోడి పందేలపై దాడులు

నల్లజర్ల: మండలంలోని అయ్యవరం, తిమ్మన్నపాలెంలలో నిర్వహిస్తున్న కోడి పందేలపై బుధవారం సాయంత్రం నల్లజర్ల పోలీసులు దాడులు జరిపారు. అయ్యవరంలో 8 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.72,550 నగదు, 15 కోడిపుంజులు,19 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే తిమ్మన్నపాలెంలో 8 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.5,200 నగదు, ఆరు కోడిపుంజులను, ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ నరసింహమూర్తి వివరించారు.

ఎస్. ముప్పవరంలో..

చాగల్లు: మండలంలోని ఎస్.ముప్పవరం శివార్లల్లో కోడిపందేలు ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్టు చాగల్లు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ బుధవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3200 నగదు, రెండు కోడిపుంజులను స్వాధీన పరచుకున్నట్టు ఎస్సై తెలిపారు.

గోపవరంలో..

గోపాలపురం: గోపవరంలో నిర్వహిస్తున్న కోడి పందేలపై గోపాలపురం పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడిలో ఆరుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.10200 నగదు, మూడు కోళ్లను స్వాధీనం చేసుకున్నారు.


కొవ్వూరులో హోం మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద పంచాంగ పఠనం చేస్తున్న దోర్బల ప్రభాకరశర్మ


ఉగాది సంబరాల్లో సరదాగా నృత్యం చేస్తున్న కొవ్వూరు మునిసిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి, ఇతర ప్రజాప్రతినిధులు


కొవ్వూరు ఉగాది సంబరాల్లో నృత్యాలు చేస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణ హైస్కూల్ విద్యార్థినులు


చాగల్లు మండలం ఊనగట్లలో పుంతలో ముసలమ్మవారి కలశ పూజలో పాల్గొన్న మహిళలు

షడ్రుచుల సమ్మేళనమే జీవితం

- హోం మంత్రి తానేటి వనిత
- క్యాంపు కార్యాలయంలో ఘనంగా ఉగాది సంబరాలు
- పంచాంగ పఠనం చేసిన దోర్బల ప్రభాకరశర్మ
- హాజరైన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు


కొవ్వూరు పంచాంగ శ్రవణంలో హోం మంత్రి తానేటి వనిత, ప్రజాప్రతినిధులు, నాయకులు

కొవ్వూరు: షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి మాదిరి మనిషి జీవితంలో సంతోషం, సుఖం, సమస్యలు, సవాళ్లు వంటివన్నీ సమ్మిళితమై ఉంటాయని హోం మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. తెలుగువారి తొలి పండగైన ఉగాదిని బుధవారం కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల్లోని ప్రతి ఇంటా సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రజలకు, వైఎస్సార్ సీపీ శ్రేణులకు మంత్రి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. శ్రీశోభకృత నామ సంవత్సరంలో ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో, భోగభాగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రముఖ పండితుడు దోర్బల ప్రభాకరశర్మ బృందం పంచాంగ పఠనం చేశారు. హిందూ చాంద్రయాన క్యాలెండర్ ప్రకారం చైత్ర మాసంలో తొలి రోజు చేసుకునే పండగే ఉగాది (యుగాది) ఉన్నారు. కొత్త సంవత్సరంలో ప్రజలంతా సుఖ సంతోషకరమైన జీవితం గడపాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. శోభకృత్ అంటే శోభను కలిగించేది అని అర్థం అన్నారు. పండితుడు ప్రభాకరశర్మను మంత్రి వనిత, అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, రష్మిత దంపతులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్థానిక డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ హైస్కూల్ విద్యార్థినులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉగాది వేడుకల్లో భాగంగా పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు సైతం నృత్యాలు చేశారు. హాజరైన వారందరికీ ఉగాది పచ్చడి, ప్రసాదం, అల్పాహారం వంటివి శ్రీనివాస రవీంద్ర దంపతులు సమకూర్చారు. మునిసిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి, వైస్ చైర్‌పర్సన్ గంధ్రోతు అంజనీదేవి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, ఏఎంసీ మాజీ చైర్మన్లు బండి పట్టాభిరామారావు, వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి, ఎంపీపీలు జొన్నకూటి పోసిరాజు, మట్టా వీరాస్వామి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కొవ్వూరు పట్టణంలో..

ఉగాది సందర్భంగా పట్టణంలోని కొవ్వూరమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు.ఆలయ ప్రాంగణంలో గరగ నృత్యాలు చేశారు. మెరక వీధిలోని కనకదుర్గమ్మ, ఆంజనేయస్వామి, ,గోష్పాద క్షేత్రంలోని సుందర సాయి, సుందర గోవిందుడు, సుందరేశ్వర స్వామి ఆలయాలను భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పాతూరులోని ఉమా చోడేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో హోం మంత్రి తానేటి వనిత పాల్గొన్నారు. పలు ఆలయాల్లో పంచాగ పఠనం చేసి, భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఉగాది వేడుకలు నిర్వహించారు.

తాళ్లపూడి: ఉగాదిని పురస్కరించుకుని వేగేశ్వరపురంలోని వేంకటేశ్వరస్వామి, తాళ్లపూడిలోని సాయిబాబా ఆలయాల్లోను, తాళ్లపూడి శివాలయంలోను ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. వివిధ గ్రామాల్లోని రామాలయాల వద్ద పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు. వేగేశ్వరపురంలోని పట్టాభిషేక సీతారామాలయం వద్ద పురాణ ఉపన్యాసకుడు పరస రాధాకృష్ణ పంచాంగ పఠనం చేశారు.

చాగల్లు: బ్రాహ్మణగూడెంలోని బాలారామలింగేశ్వరస్వామి, చాగల్లు ప్రధాన కూడలిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో పంచాగ శ్రవణం చేశారు. గ్రామపెద్దలు, స్థానికులు అధిక సంఖ్యలో విచ్చేసి ఈ ఏడాది పంటల తీరు, వర్షపాతం వంటి అంశాల గురించి శ్రద్ధగా ఆలకరించారు. చాగల్లులోని కనకదుర్గమ్మ, ఊనగట్లలోని పుంతలో ముసలమ్మ అనే కనకమహాలక్ష్మి అమ్మవారి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మహిళలు కలశ పూజ చేశారు. చాగల్లు కనకదుర్గమ్మ ఆలయంలోను, పాటెమ్మపేటలోని పాటెమ్మ అమ్మవారి ఆలయంలోను ప్రత్యేక పూజలు జరిగాయి. బ్రాహ్మణగూడెం నాగారమ్మ ఆలయంలోను, మార్కొండపాడు, చిక్కాల, చంద్రవరం తదితర గ్రామాల ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.


ఉండ్రాజవరంలో ముత్యాలమ్మ వారి అలంకారం

వేద పండితులకు పురస్కారాలు

నిడదవోలు రూరల్: ఉగాదిని పురస్కరించుకుని బుధవారం శ్రీచైతన్య సాహిత సమాఖ్య వార్షికోత్సవం నిర్వహించారు. పట్టణంలోని గోలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని గీతా మందిరంలో నిర్వహించిన ఈ వేడుకల్లో శ్రీచైతన్య సాహితీ సమాఖ్య కార్యదర్శి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పొన్నా కృష్ణబాబు పంచాంగ పఠనం చేశారు. అనంతరం సాహిత వేద పండితులు బ్రహ్మశ్రీ పోలేపెద్ది లక్ష్మీనారాయణావధానులు, అనిపెద్ది జగన్నాథశర్మ, రంగస్థల కళాకారులు పిప్పిరిశెట్టి వెంకటేశ్వరరావు, తబలా ఆర్టిస్ట్ పి.బాలకృష్ణలకు ఉగాది పురస్కారాలు అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చైతన్య సాహిత్య సమాఖ్య అధ్యక్షుడు నడుపల్లి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు పొన్నా సుబ్రహ్మణ్యం, సంయుక్త కార్యదర్శులు శ్రీకాకుళపు వెంకటేశ్వరరావు, మధుసూధన రావు, కోశాధికారి వేదుల జనార్దన్, రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, ఎండీ ఫయాజ్, సభ్యులు పాల్గొన్నారు.


దేవరపల్లిలో కడియాలమ్మ తల్లి ఊరేగింపు

ఉండ్రాజవరం: ఉగాది సందర్భంగా మండలంలోని అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణాలు నిర్వహించారు. భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఉండ్రాజవరంలో బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ పీసపాటి పాలశంకర వరప్రసాద్ సిద్ధాంతి పంచాంగ పఠనం చేశారు. పాలంగిలోని కనక దుర్గమ్మను పుష్పాలతో విశేషంగా అలంకరించారు. అర్చకుడు చక్రవర్తుల ధన్వంతరి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఉండ్రాజవరం గ్రామదేవత ముత్యాలమ్మ వారిని వేప ఆకులతో, కలువ పువ్వులతో అలంకరించారు. వేలివెన్నులోని భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఏరువాక సాగిన రైతులు

దేవరపల్లి: ఉగాది సందర్భంగా రైతులు పొలాల్లో ఏరువాక సాగారు. ఆలయాల వద్ద పంచాంగ శ్రవణం నిర్వహించారు. గ్రామ దేవతలకు పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు.దేవతలకు చలివిడి, పానకాలు అందజేశారు. దేవరపల్లిలోని గ్రామ దేవత కడియాలమ్మ అమ్మవారికి గ్రామస్తులు పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం గ్రామంలో ఊరేగించారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారికి చందనం పూచి ప్రత్యేక అలంకరణ చేశారు.

నేటి నుంచి సప్తాహం

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఈనెల 23 నుంచి 30 వరకూ ప్రథమ సప్తాహం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 30న స్వామివారి కల్యాణం కోసం భారీ ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంటోంది.

రోడ్డు నిర్మాణానికి శ్రీకారం

గోపాలపురం: ఎట్టకేలకు గోపాలపురంలోని బీసీ హాస్టల్ రోడ్డుకు మోక్షం లభిస్తోంది. ఈ రోడ్డు నిర్మాణ పనులను గోపాలపురం సర్పంచ్ పైడి శిరీష, ఉప సర్పంచ్ ముల్లంగి శ్యామ్‌సుందర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎస్‌కె వలీ బుధవారం ప్రారంభించారు. రూ 3.5 లక్షల వ్యయంతో రోడ్డును నిర్మిస్తున్నట్టు వారు తెలిపారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఇచ్చిన హామీ మేరకు రోడ్డు నిర్మాణం చేపట్టడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ నాయకులు ఇంజమూరి సుబ్బారావు, దాసరి కుటుంబరావు, కప్పల వరలక్ష్మి పాల్గొన్నారు.

శక్తమ్మ తల్లి ఉత్సవాలు ప్రారంభం


అన్నవరప్పాడులో విశేష అలంకరణలో శక్తమ్మ తల్లి


తాళ్లపూడి మోదుగులమ్మ ఆలయంలో గ్రామస్తుల పూజలు

పెరవలి: అన్నవరప్పాడులోని శక్తమ్మ తల్లి ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏటా ఉగాది రోజున ప్రారంభించి వారం రోజుల పాటు శక్తమ్మ తల్లి ఉత్సవాలను నిర్వహిస్తారు. అమ్మవారి దర్శనాలను తెల్లవారుజాము నాలుగు గంటల నుంచే ప్రారంభించారు. ఉత్సవాలను తిలకించడానికి ఖండవల్లి, ముక్కామల, నల్లాకులవారి పాలెం, పిట్టల వేమవరం, మల్లేశ్వరం, కడింపాడు, వడలి, పెనుగొండ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలి వచ్చారు. ఖండవల్లి, అన్నవరప్పాడు గ్రామాల్లోని శక్తమ్మ అమ్మవారికి ఉదయం నుంచీ భక్తులు మేకపోతులు, కోళ్లను బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు.

సందడిగా గ్రామ దేవతల ఉత్సవాలు

తాళ్లపూడి: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సందడిగా గ్రామ దేవతల ఉత్సవాలు నిర్వహించారు. అమ్మవార్లకు భక్తి శ్రద్ధలతో పూజలు చేసి తమ కుటుంబాలను చల్లంగా చూడాలంటూ నైవేద్యాలు సమర్పించారు. తాళ్లపూడిలోని మోదుగులమ్మ తల్లికి విశేష పూజలు చేశారు. అమ్మవారి సిరిబొమ్మకు గరగ నృత్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే వేగేశ్వరపురంలోని పంట పొలాల్లో వెలసిన ధనమ్మతల్లి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. పెద్దేవం గ్రామదేవత గార్లమ్మతల్లి ఉత్సవాలు జరిగాయి. గరగ నృత్యాలతో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాల వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గజ్జరంలోని గ్రామ దేవత ముత్యాలమ్మతల్లి ఉత్సవాలు నిర్వహించారు.

గండిపోశమ్మకు మంత్రి వనిత పూజలు

కొవ్వూరు: కుమారదేవంలోని గండిపోశమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న ఉగాది వేడుకల్లో హోం మంత్రి తానేటి వనిత బుధవారం సాయంత్రం పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం మంత్రి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.ధర్మకర్తల మండలి చైర్మన్ గంధం శ్రీనివాస్ మంత్రికి పట్టువస్త్రాలు సమర్పించారు. వైఎస్సార్ సీపీ మండల గౌరవాధ్యక్షుడు గన్నమని వీర వెంకట్రావు, కుమారదేవం ఎత్తిపోతల పథకం రైతు సంఘం అధ్యక్షుడు గోలి శ్రీనివాస్, సర్పంచ్ కాసాని దుర్గ, కోడూరి సత్యనారాయణ (సత్తులు) తదితరులు పాల్గొన్నారు. ఉదయం ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ గంధం శ్రీనివాస్ దంపతుల చేతుల మీదుగా గండిపోశమ్మ వారికి పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో శక్తి వేషాలు, గరగ నృత్యాలు, తీన్‌మార్ వాయిద్యాలతో అమ్మవారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉగాది ఉత్సవాలను ఈనెల 26 వరకూ నిర్వహించనున్నట్టు ఈవో మీసాల నాగరాజు తెలిపారు. 27న అన్న సమారాధనతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.అంతకు ముందు కొవ్వూరు పట్టణంలోని ఐదో వార్డులో ఉమా చోడేశ్వరస్వామి ఆలయంలో రథోత్సవాన్ని మంత్రి వనిత ప్రారంభించారు. నాయకులు, భక్తులతో కలిసి మంత్రి కొద్ది దూరం స్వామివారి రథాన్ని లాగారు. కౌన్సిలర్ మద్దిపట్ల సాయిగీత, అర్చకులు కొతవరపు భాను తదితరులు పాల్గొన్నారు.


కుమారదేవంలో గండిపోశమ్మ వారికి మంత్రి తానేటి వనిత పూజలు

కోటసత్తెమ్మ ఆలయంలో భక్తుల సందడి

నిడదవోలు రూరల్: ఉగాదిని పురస్కరించుకుని మండలంలోని తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ వారి ఆలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బంగారు ఆభరణాలు, రంగురంగుల పుష్పాలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో పంచాంగ పఠనం చేశారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు చక్కెర పొంగలి, పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం ఈఓ బళ్ల నీలకంఠం (శివ) ఆధ్వర్యంలో ప్రధానార్చకుడు అప్పారావు శర్మ, అర్చకుడు బి.మల్లేశ్వరరావులకు పట్టువస్త్రాలు అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రామసుబ్బరాయశాస్త్రి, ధర్మకర్తల మండలి సభ్యులు గాజుల రంగారావు, అయినీడి వెంకటకృష్ణ, మిద్దే శ్రీను, రేలంగి మారుతి శివ భాస్కరరావు, ఉర్ల వీరవెంకటలక్ష్మి, బోనేపల్లి ఉమాదేవి, వద్దిరెడ్డి మహాలక్ష్మి, నిచ్చెనకోళ్ల భవానీ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


కోటసత్తెమ్మ వారికి ఉగాది పూజలు చేస్తున్న దృశ్యం

రైతు దేశానికి వెన్నెముక వంటివాడు

- ఇస్కాన్ టెంపుల్ చైర్మన్ శ్యామాంగ శ్రీనివాస్ దాస్
- మార్కొండపాడులో ఉగాది పురస్కారాల ప్రదానం


మార్కొండపాడులో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన వారిని సత్కరిస్తున్న దృశ్యం

చాగల్లు: రైతు దేశానికి వెన్నెముక వంటి వాడని రాజమహేంద్రవరం ఇస్కాన్ టెంపుల్ చైర్మన్ శ్యామాంగ శ్రీనివాస్ దాస్ అన్నారు. సుంకవల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం మండలంలోని మార్కొండపాడులో నిర్వహించిన ఉగాది సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గోమాత, భూమాతను పూజిస్తేనే మనకు ఆహారం లభిస్తుందన్నారు. వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సుంకవల్లి ఫౌండేషన్ చైర్మన్ వెంకన్న చౌదరిని అభినందించారు. ఉగాదిని పురస్కరించుకుని పలువురు గొప్ప వ్యక్తులను సన్మానించడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ చైర్మన్ వెంకన్నచౌదరి మాట్లాడుతూ తన తండ్రి వెంకటరత్నం వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. ఆయన దత్తత గ్రామంగా మార్కొండపాడును ఫౌండేషన్ ద్వారా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా పరిసర ప్రాంతాల్లో విద్య, వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో రాణిస్తున వారికి, ఉత్తమ అధికారులకు ఉగాది పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. ఉత్తమ అధికారు విభాగంలో నిడదవోలు సీఐ వెంకటేశ్వరరావు, చాగల్లు ఎంపీడీవో బి.రామ్‌ప్రసాద్, ఉత్తమ రైతుల విభాగంలో పలువురు రైతులనుర, ఉత్తమ విద్యార్థులను, వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వారిని దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా సంప్రదాయబద్ధంగా చేసిన హరే శ్రీనివాస కోలాట నృత్య బృందం కోలాట నృత్యాలు అలరించాయి.

యుక్తేశ్వర ధ్యాన మందిరంలో విగ్రహాల ప్రతిష్ఠ

దేవరపల్లి: దేవరపల్లి–గోపాలపురం మార్గంలో హైవేకు సమీపంలో సువిశాల ప్రాంగణంలో యుక్తేశ్వరస్వామి వారి పంచాయతన ధ్యాన మందిరాన్ని నిర్మించారు.ఈ మందిరంలో లక్ష్మీగణపతి, లలితా త్రిపుర సుందరి, లక్ష్మీనారాయణ, సూర్యనారాయణ సహిత యుక్తేశ్వరస్వామి వార్ల విగ్రహాలను బుధవారం ప్రతిష్ఠించారు. గ్రామానికి చెందిన కేశిరాజు వీర్రాజు కుమారుడు వెంకట్రాజు, ఉమాసుందరి దంపతులు, వారి కుటుంబ సభ్యులు ఈ ధ్యాన మందిరాన్ని నిర్మించారు. వేద మంత్రాల మధ్య వెంకట్రాజు దంపతులు విగ్రహాల ప్రతిష్ఠాపన చేశారు.

నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలు ప్రారంభం

దేవరపల్లి: మండలంలోని గౌరీపట్నం వద్ద గల నిర్మలగిరి మేరీమాత మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 25 వరకూ కొనసాగుతాయి. తొలిరోజు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రార్థనలు చేశారు. పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఎస్.జాన్‌పీటర్ ప్రత్యేక ప్రార్థనలు, పూజలు నిర్వహించి భక్తులను ఆశీర్వదించారు. విద్యుత్తు దీప కాంతులతో నిర్మలగిరి పుణ్యక్షేత్రం శోభాయమానంగా వెలుగొందుతోంది. చివరి రెండు రోజులు భక్తుల సంఖ్య ఎక్కువగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. గురువారం సాయంత్రం వాటికన్ రాయబారి లియోపోల్డో జిరెల్లీ, ఏలూరు పీఠాధిపతి జయరావు పొలిమెర సమష్టి దివ్యబలిపూజ నిర్వహిస్తారని డైరెక్టర్ జాన్ పీటర్ తెలిపారు.

ప్రత్యేక పోలీసు బందోబస్తు

మేరీమాత ఉత్సవాల్లో ఆకతాయిలను అదుపు చేసేందుకు అదనపు పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్టు కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పుణ్యక్షేత్రంలో బందోబస్తుకు వచ్చిన సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బైక్ దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున భక్తులు తమ బైక్‌లను నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశాల్లో పార్కింగ్ చేసుకోవాలన్నారు. ఉత్సవాల నాలుగు రోజులు తమ వాహనాలను గౌరీపట్నం, దుద్దుకూరు ప్రాంతాల్లో తిప్పరాదని, ఇప్పటికే క్వారీ, క్రషర్ల యజమానుల, లారీ అసోసియేషన్ సభ్యులకు నోటీసులు జారీ చేశామన్నారు. మూడు షిఫ్టుల్లో 300 మంది పోలీస్‌లు, 100 మంది మహిళా పోలీసులతో పాటు 60 మంది ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహిస్తారన్నారు. ముగ్గురు సీఐలు, 12 మంది ఎస్సైలు బందోబస్తును పర్యవేక్షిస్తారని చెప్పారు.


గౌరీపట్నంలోని నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్రం